
సాక్షి పల్నాడు

మంగళవారం । 10 । జూన్ । 2025



హుండీ ఆదాయం రూ.1.15 కోట్లు

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి ఆలయంలోని హుండీల్లో రూ.1.15 కోట్లకు పైగా నగదును కానుకలు, మొక్కుబడుల రూపంలో భక్తులు సమర్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 511.90 అడుగుల వద్ద ఉంది. ఇది 134.9183 టీఎంసీలకు సమానం.



ఆలయ భద్రతపై అలసత్వం వద్దు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆలయ భద్రతకు సంబంధించి అలసత్వంగా ఉండవద్దని దుర్గగుడి ఈవో శీనానాయక్ ఆదేశాలు జారీ చేశారు. ఈవో సోమవారం తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్

మహా పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలు ముగింపు



నగరంపాలెం: స్థానిక కృష్ణనగర్ ఒకటో వీధిలో గల గోదా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఐదు రోజులుగా నిర్వహిస్తోన్న 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం సుప్రభాత సేవ, నిత్య పూజలతో ప్రారంభమవ్వగా, అర్చక బృందం వేద మంత్రాలతో సుదర్శన మూలమంత్ర హోమం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవార్ల అప్పగింతలు, వసంతోత్సవం, చక్రస్నానం కార్యక్రమాలు చేపట్టారు. శ్రీవారికి తిరుప్పావడ సేవ అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం ధ్వజావరోహణం, గరుడ ప్రసాద వితరణ, ద్వాదశ ప్రదక్షిణాలు, రుత్విక్ సన్మానం, వేదాశీర్వాదం, తీర్థప్రసాద గోష్ఠితో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు ధనకుదరం శ్రీనివాసాచార్యులు, ధనకుదరం వెంకట సత్యవైభవ్ పర్యవేక్షించారు.

సీఎం సభా వేదిక ఏర్పాట్లు పరిశీలన



తాడికొండ: తుళ్లూరు మండలం వెలగపూడిలో ఈనెల 12న సుపరిపాలన - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్న నేపథ్యంలో సభా ఏర్పాట్లను సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ పర్యవేక్షించారు. పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సభా వేదిక, ఇతర ఏర్పాట్లను అధికారులతో చర్చించి, ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రొటోకాల్ డైరెక్టర్ మోహనరావు, గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మురళీకృష్ణ, తహసీల్దారు సుజాత పాల్గొన్నారు.

11న ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ 11వ తేదీ బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. బుధవారం తెల్లవారుజామున 5.55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. సుమారు 8 కిలోమీటర్ల సాగే గిరిప్రదక్షిణ కుమ్మరిపాలెం, విద్యాధరపురం, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి మీదగా ఆలయానికి చేరుకోనుంది. గిరి ప్రదక్షిణలో అమ్మవారి భక్తులు, సేవా బృంద సభ్యులు విశేషంగా పాల్గొనాలని ఈవో పిలుపునిచ్చారు.

బ్లాక్ బర్లీ... రైతు వర్రీ

- కొనుగోలు లేక పొగాకు రైతుల అవస్థలు
- జిల్లాలో 4,840 ఎకరాల్లో సాగు చేసిన రైతులు
- సుమారు 52 వేల క్వింటాళ్ల నిల్వలు
- కొనుగోలు చేయని కంపెనీలు, వ్యాపారులు
- రైతులు ఉద్యమాలు చేస్తున్న పట్టించుకోని ప్రభుత్వం
- మార్క్‌ఫెడ్‌తో కొంటామంటూ ప్రకటనలతో సరిపెడుతున్న ప్రభుత్వం

నల్ల బర్లీ పొగాకు పండించిన రైతుల కష్టాలు అన్ని ఇన్ని కావు. రెండేళ్లుగా ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది అధిక పెట్టుబడులు పెట్టి బ్లాక్ బర్లీ రకం పొగాకు పండించారు. తీరా పంట చేతికొచ్చిన తర్వాత మార్కెట్‌లో కొనేవారు లేరు. పొగాకు కంపెనీలు, వ్యాపారులు చేతులెత్తేశారు. కొందరు వ్యాపారులైతే అందినకాడికి తక్కువ ధర రైతులకు ముట్టచెప్పి కొనుగోలు చేయాలని చూస్తున్నారు. దీనిపై రైతులు, రైతు, కూలీల సంఘాలు, ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం రైతుల ఘోషను పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల వద్ద పేరుకుపోయిన పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



పట్టలు కప్పి భద్రపర్చిన పొగాకు నిల్వలు



పొగాకు పంట సాగు చేసిన దృశ్యం

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా వ్యాప్తంగా సుమారు 4,840 ఎకరాల్లో ఈ ఏడాది బ్లాక్ బర్లీ పొగాకును సాగు చేసినట్టు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ రకం పొగాకు నిల్వలు సుమారు 52 వేల క్వింటాళ్లు ఉన్నట్టు అంచనా. జిల్లా వ్యాప్తంగా 1,421 మంది రైతులు ఆన్‌లైన్‌లో బ్లాక్ బర్లీ సాగు చేసేందుకు నమోదు చేసుకున్నారు. ధరలు ఆశాజనకంగా వస్తుండటంతో అనధికారికంగా మరికొంత మంది రైతులు బ్లాక్ బర్లీ సాగు చేశారు. కౌలు, కూలీల ధరలు, ఇతర ఖర్చులు పెరగడంతో ఎకరా సాగుకు సుమారు రూ.1.25 లక్షల నుంచి రూ.1.5 లక్షల దాకా ఖర్చు అవుతోంది. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి లభించింది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా రూ.15 వేలకు కొనుగోలు చేస్తేనే రైతులకు న్యాయం జరుగుతుందని రైతు సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే పొగాకు కొనుగోలు జరగకపోవడంతో కనీసం కూలీలకు చెల్లింపులు చేయలేని దుస్థితిలో రైతన్నలున్నారు.

ప్రభుత్వ హామీ అమలేది...?

మే 24న మార్టూరులో పొగాకు కంపెనీలతో సమీక్ష నిర్వహించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు రైతులు పండించిన చివరి ఆకు వరకు కొనాలని కంపెనీలకు ఆదేశాలు జారీ చేశారు. కానీ ఇప్పటివరకు ఆ దిశగా చర్యలేవీ తీసుకోలేదు. మంత్రి పర్యటన తరువాత కొన్ని కంపెనీలు అరకొర కొనుగోలు చేసి మమ అనిపించాయి. బర్లీ పొగాకు నాణ్యతను బట్టి రూ.6 వేల నుంచి రూ.12 వేల వరకు ధర చెల్లించాలని ప్రభుత్వ ఆదేశాలున్నా కంపెనీలు బేఖాతరు చేశాయి. గ్రేడింగ్ పేరుతో రైతులను దగా చేశాయి. మరోవైపు మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్న హామీ నేటికీ అమలు కావడం లేదు. మార్క్‌ఫెడ్ అధికారులు ఎప్పుడు కొంటారు, ఎంతకు కొంటారు, ఎంత కొంటారన్న విషయాలపై స్పష్టత ఇవ్వడం లేదు. ప్రభుత్వ, కంపెనీల తీరుపై జిల్లాలో రైతు సంఘాల నాయకులు ఉద్యమ బాటపట్టి ఇప్పటికే పలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అయినా ప్రభుత్వం రైతుల సమస్యలను తీర్చడంలో మాత్రం చిత్తశుద్ధి చూపడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి



బ్లాక్ బర్లీ రైతుల సమస్యలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కావడం లేదు. ప్రభుత్వం చెప్పినట్టు కంపెనీలు రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేయడం లేదు. దీని వల్ల రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మార్క్‌ఫెడ్‌తో కొంటామని ప్రభుత్వం రూ.350 కోట్లు కేటాయించనట్టు చెబుతున్నా, ఇప్పటివరకు కొనుగోలు ప్రక్రియ మొదలు కాలేదు. ఆలస్యమైతే ప్రైవేట్ వ్యక్తుల నుంచి తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి మరింత నష్టపోతారు. వెంటనే గ్రేడ్‌ల నిబంధన కాకుండా రైతుల నుంచి క్వింటాల్ రూ.15 వేలకు కొనుగోలు చేయాలి. వచ్చే ఏడాదికి పొగాకు బదులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.

–డాక్టర్ కొల్లా రాజమోహనరావు, నల్లమడ రైతు సంఘం కన్వీనర్

సిండికేట్‌తోనే అసలు సమస్య



గతంలో ఎన్నడూ లేని విధంగా బ్లాక్ బర్లీ రైతులు నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది 5 ఎకరాల్లో బ్లాక్ బర్లీ, 4 ఎకరాల్లో ఎఫ్‌సీ ఆర్‌ఎస్ రకాల పొగాకు సాగు చేశాను. రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టాను. కనీసం రూ.1.5 లక్షలు కూడా రాని దుస్థితి. కంపెనీలు సిండికేట్ అయ్యి రైతులను నిండా మోసం చేస్తున్నాయి. ఇలా అయితే కౌలు డబ్బులు ఎలా చెల్లించాలి, అప్పులు ఎలా కట్టాలి. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

– పాలూరి శ్రీనివాసరెడ్డి, పొగాకు రైతు, సొలస, యడ్లపాడు మండలం

యోగాతో మానసిక ప్రశాంతత

యోగా ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, జేసీ



నరసరావుపేట: యోగాతో మానసిక ప్రశాంతత, కొన్ని శారీరక రుగ్మతల నుంచి ఉపశమనం పొందవచ్చని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం పెదచెరువురోడ్డులో రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పెద్దచెరువు రోడ్డు నుంచి గడియారం స్తంభం వరకు నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మాస్టర్ ట్రైనర్ ద్వారా నేర్చుకొన్న ఆసనాలను ప్రతి రోజూ కొంత సమయం కేటాయించి సాధన చేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి ఏకా మురళి, నరసరావుపేట, గురజాల, సత్తెనపల్లి ఆర్డీఓలు కె.మాధవీలత, మురళీకృష్ణ, రమాకాంతరెడ్డి, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి మధు కీర్తి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానం పెనుభూతమై..

బాపట్లటౌన్: భార్యపై అనుమానంతో భర్త పెట్రోలు పోసి నిప్పంటించిన వైనం బాపట్ల మండలం జమ్ములపాలెంలో చోటుచేసుకుంది. జమ్ములపాలెం గ్రామానికి చెందిన దాసరి సుభాషిణి(30)కి అదే గ్రామానికి చెందిన హరీష్‌తో 12 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు మగ పిల్లలు. అనుమానంతో భర్త హరీష్ సోమవారం ఆమె శరీరంపై పెట్రోలు పోసి నిప్పంటించాడు. తీవ్ర గాయాలపాలైన ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. 80 శాతం కాలిపోయిన శరీరానికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. మార్గంమధ్యలో ఆమె మృతిచెందింది. రూరల్ సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించడమే..

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



సబ్ జైలు బయట మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలు, మీడియా వ్యక్తిగత స్వేచ్ఛ, మాట్లాడే హక్కును హరించివేస్తుందని ఇందుకు నిదర్శనమే సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు అని పల్నాడు జిల్లా నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను నరసరావుపేట, రొంపిచర్ల మండల నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం జైలు ప్రాంగణం బయట మీడియాతో మాట్లాడారు. సాక్షి చానల్‌లో నిర్వహించిన డిబేట్‌లో కృష్ణంరాజు అనే జర్నలిస్టు పాల్గొని వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారని, దానిమీద యాంకర్‌గా వ్యవహరించిన కొమ్మినేని శ్రీనివాసరావు కూడా క్షమాపణలు చెప్పారని అన్నారు. అయినప్పటికీ 40ఏళ్ల జర్నలిస్టుగా అనుభవం ఉన్న సాక్షి యాంకర్ కొమ్మినేనిని హైదరాబాదులో అరెస్ట్ చేశారన్నారు. కనీసం జర్నలిస్టులకు కూడా భద్రత లేకుండా, స్వేచ్ఛ లేకుండా వారికున్న హక్కులను కూడా హరించి వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎవరూ మాట్లాడటానికి లేదని, సాక్షి ఛానల్ మూసివేయాలని చూస్తున్నారన్నారు. ఆ ఛానల్ మూసివేస్తే తాము చేసే అక్రమాలన్ని బయటికి రావనే తప్పుడు ఆలోచనతో తప్పుడు కేసులు సాక్షి మీద బనాయిస్తున్నారని అన్నారు.

చంద్రబాబు సమాధానం చెప్పాలి

వినుకొండ: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్ పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది ఎమ్.ఎస్.ప్రసాదు పేర్కొన్నారు. సోమవారం వినుకొండలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొమ్మినేని అనని మాటలకు సైతం ఆయన్ను అరెస్టు చేయడం సబబు కాదన్నారు. గత రెండురోజుల క్రితం సాక్షి మీడియాలో కృష్ణంరాజు అమరావతి మహిళలపై మాట్లాడిన మాటలను కొమ్మినేని సమర్థించలేదని, క్షమాపణలు కోరారన్నారు. అయినా సీఎం చంద్రబాబు ఎన్నికలహామీలు అమలుచేయకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తూ, వారి పార్టీ మహిళలను ఉసిగొల్పుతున్నాడన్నారు. గతంలో టీడీపీ నాయకులు మహిళలపట్ల అమర్యాదగా మాట్లాడటం, దాడులు చేసినప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మీడియాపై దాడులు చేసినా, జర్నలిస్టులపై దాడులుచేసినా చర్యలు తీసుకుంటున్నామన్న చంద్రబాబు సాక్షి కార్యాలయయాలపై దాడులు జరుగుతుంటే ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలన్నారు.

ఉజ్వల భవిష్యత్ కోసం కష్ట పడండి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి
- జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పది, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు పొందిన విద్యార్థులతో మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని చేపట్టిన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్ కోసం మరింత కష్టపడాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ ఆధ్వర్యంలో సోమవారం భువనచంద్ర టౌన్‌హాలులో నిర్వహించిన పది, ఇంటర్ విద్యార్థులకు (షైనింగ్ స్టార్స్) ప్రతిభ పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ జిల్లాలో 222 మందికి ప్రతిభా పురస్కారాలు అందిస్తుంటే అందులో 129 మంది బాలికలే ఉండటం, బాలికల విద్యాస్థాయి మెరుగుదలకు ఇది నిదర్శనమన్నారు. బాల్య వివాహాలలో పల్నాడు జిల్లా రాష్ట్రంలోనే ఐదో స్థానంలో ఉండటం దురదృష్టకరం అన్నారు. ఈ పరిస్థితిని రూపుమాపేందుకు అందరూ కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపడ్డాయన్నారు. ఈ ఫలితాలకు ఉపాధ్యాయుల కృషి తర్వాత తల్లిదండ్రులే కీలకమన్నారు. కుటుంబ ప్రభావం పిల్లలపై పడకుండా చూసుకోవాలన్నారు. గురువులను మర్చిపోకూడదని, క్రమశిక్షణ, సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. పేదరికం విజ్ఞానానికి, ప్రతిభకు అడ్డు కాదని నిరూపించిన విద్యార్థులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు మాట్లాడుతూ ఇప్పుడు వచ్చిన మార్కులతో పొంగిపోకుండా రానున్న రోజులలో కూడా బాగా కష్టపడి చదవాలని కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో రాణించడానికి మార్కులే కొలమానం కాదని, మానసిక విజ్ఞానం, సంకల్పం మెరుగుపడాలని అన్నారు. ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేశారు. టీచర్ బాలరాజు పాడిన పాటలు, కుసుమశ్రీ హంసా వైష్ణవి నృత్యాలు ఆహుతులను అలరించాయి. ఏపీ శిల్పారామ, ఆర్ట్స్, సాంస్కృతిక సంస్థ చైర్మన్ చేరెడ్డి మంజులా రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయాల పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జీడీసీసీ బ్యాంకు జిల్లా చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఆర్డీఓ కె.మధులత, ఏఎంసీ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్త, జిల్లా విద్యాశాఖ అధికారులు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- పీజీఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి 162 అర్జీలు స్వీకరణ



అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధ్యక్షత ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 162 అర్జీలు స్వీకరించారు. పీజీఆర్‌ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్ఓ ఏకా మురళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


రుణం ఇస్తామని చెప్పి ఇవ్వలేదు



రెండేళ్ల కిందట లైవ్‌స్టాక్ మిషన్ వారు ఔత్సాహిక రైతులు, నిరుద్యోగులకు రూ.10 లక్షలు రుణం ఇచ్చేందుకు ప్రకటన ఇచ్చారు. ఈ మేరకు ములకలూరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో దరఖాస్తు చేశా. అన్నీ పత్రాలు సిద్ధం చేసిన తర్వాత వాయిదాలు వేస్తూ రుణం మంజూరు చేయకుండా తిప్పుతున్నారు. నాకు రుణం ఇప్పించండి.

– మేడ పోతురాజు, పెదరెడ్డిపాలెం, నరసరావుపేట

రాజకీయ కారణాలతో అన్యాయంగా తొలగించారు



నకరికల్లు, రేమిడిచర్ల, బొల్లాపల్లి, వినుకొండ, సత్తెనపల్లి ప్రాంతాలలోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో 2014 నుంచి పనిచేస్తున్న సుమారు 35 మంది షిఫ్ట్ ఆపరేటర్లను రాజకీయ కారణాలతో అర్ధంతరంగా తొలగించారు. తమపై వైఎస్సార్ సీపీ ముద్ర వేశారు. మాలో కొంతమంది 2014కు ముందు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో చేరిన వాళ్లం కూడా ఉన్నాం. ఎటువంటి కారణం లేకుండానే ఉద్యోగాలకు రావొద్దని చెప్పారు. తమ స్థానంలో మరొకరిని నియమిస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇదే మాకు జీవనాధారం. దయచేసి మా ఉద్యోగాలు మాకు ఇప్పించండి.

– షిఫ్ట్ ఆపరేటర్లు

నరసరావుపేటకు మరో బైపాస్ నిర్మించండి



వినుకొండ నుంచి గుంటూరు వరకు చేపట్టిన హైవే నిర్మాణం కోసం సేకరిస్తున్న యల్లమంద, కేసానుపల్లి గ్రామ పరిసరాల్లోని సర్వే నంబర్ల భూముల్లోని తమ స్థలాల్లో గృహాలు, మెకానిక్ షెడ్లు, ఖాళీ స్థలాలు, వ్యాపార సంస్థలు నిర్మించి ఉన్నాం. ఆయా ప్రదేశాల్లో సెంటు భూమి ధర రూ.30లక్షల వరకు ఉంది. తాము ఆ స్థలాలు నష్టపోకుండా ఉండేందుకు అన్నీ గ్రామాలకు బైపాస్ నిర్మాణం చేసినట్లుగానే నరసరావుపేట పట్టణానికి కూడా బైపాస్ నిర్మాణం చేయాలి.

– వినుకొండ-గుంటూరు హైవే బాధితులు

‘కలం’ ఎత్తిన సాక్షి ఉద్యోగులు



జిల్లావ్యాప్తంగా సాక్షి కార్యాలయాలు, యూనిట్ ఆఫీస్‌లపై దాడులు చేస్తున్న తెలుగుదేశం పార్టీ మహిళలు, రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సాక్షి ప్రతినిధులు గుంటూరులో స్పెషల్ బ్రాంచ్ సీఐ అళహరి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. సాక్షి దినపత్రిక, సాక్షి టీవీ కార్యాలయాలపై దాడులు జరగకుండా భద్రత కల్పించాలని కోరారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల దౌర్జన్యాన్ని ఖండిస్తూ మంగళగిరిలోని సాక్షి కార్యాలయం ఉద్యోగులు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నేతల దురాగతాన్ని ఖండించారు. – లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్)

క్లుప్తంగా

టీడీపీ, జనసేన నేతల బాహాబాహీ

సత్తెనపల్లి: ఆధిపత్య పోరులో భాగంగా సత్తెనపల్లి మండలం వెన్నాదేవి గ్రామంలో సోమవారం టీడీపీ, జనసేన నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అచ్చంపేట మండలం ఓర్వకల్లులో ఓ శుభ కార్యానికి టీడీపీకి చెందిన కిలారి వేణు, జనసేనకు చెందిన రాట్నాల నాగరాజు ఆదివారం హాజరయ్యారు. అక్కడ వారి మధ్య వాదోపవాదాలు జరిగాయి. అంతటితో ఆగకుండా ఇరు వర్గాలవారు సోమవారం గ్రామంలో ఘర్షణకు దిగారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశం ఉండడంతో సత్తెనపల్లి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాల వారికి హెచ్చరికలు చేసి పంపారు. ఈ విషయం స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి రావడంతో కేసు కట్టాల్సిందిగా సత్తెనపల్లి రూరల్ పోలీసులకు సూచించారు.
ఈ క్రమంలో వీరిలో ఒకరు పరారయ్యారు. ఈ ఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

జూదరులు అరెస్ట్

8 మంది నుంచి రూ. 67,200 స్వాధీనం

రెంటచింతల: గ్రామాల్లో ఎవరైన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సీహెచ్ నాగార్జున హెచ్చరించారు. సోమవారం విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక బైపాస్ రహదారిలోని ఓ లాడ్జిలో జూదం(పేకాట) ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 67,200 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక అసాంఘిక చర్యలు జరగకుండా ఉండాలంటే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలు నివారణలో పోలీసు సిబ్బందితో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఎస్ఐ కోరారు.

ఆస్తి కోసం కన్న కొడుకు దాడి

- పోలీసు పీజీఆర్ఎస్‌లో అంచులవారి పాలెంకు చెందిన వృద్ధురాలు ఫిర్యాదు
- మొత్తం 51 అర్జీలు స్వీకరించిన ఎస్పీ కంచి శ్రీనివాసరావు



కొడుకు దాడిలో గాయపడిన వృద్ధ దంపతులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: ఆస్తి కోసం కన్న కొడుకే దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడని రాజుపాలెం మండలం అంచులవారిపాలెంకు చెందిన పాతశెట్టి మంగమ్మ జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి పిర్యాదులు స్వీకరించారు. వివిద సమస్యలకు సంబంధించిన 51 ఫిర్యాదులు పోలీసులకు అందాయి.

వృద్ధ తల్లిదండ్రులపై దాడి

అంచులవారిపాలెంకు చెందిన మంగమ్మ, నాగయ్య దంపతులకు ఒక ఆడ, ఇద్దరు మగ సంతాసం. పెద్ద కుమారుడు ఐదు సంవత్సరాల క్రితం చనిపోగా, చిన్న కుమారుడు ఏడుకొండలుకు వివాహం జరిపించి తన వాటా ఆస్తిని పంచి ఇచ్చారు. వృద్ధ దంపతులు బతకడానికి ఉంచుకున్న 1.30 సెంట్లు భూమిని, ఇంటి స్థలాన్ని సైతం తనపేరిట రాయాల్సిందేనని ఏడుకొండలు ఈనెల 1వ తేదీన మంగమ్మ, నాగయ్యలపై దాడికి పాల్పడ్డాడు. తలకు తీవ్ర గాయమైన మంగమ్మ సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందింది. 14 కుట్లు పడ్డాయి. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

బ్యాంక్ కాంప్లెక్స్‌లో బెల్టుషాపు

సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల ఆంధ్రా బ్యాంక్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపు వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాంప్లెక్స్‌లోని దుకాణాదారుడు చిలుకొటి శ్రీనివాసరావు ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. మద్యం సేవించిన వ్యక్తులు అపస్మారక స్థితిలో తన దుకాణం ముందు పడి ఉండటం వలన వ్యాపారం సరిగా నిర్వహించలేకపోతున్నామని తెలిపాడు. దీనిపై ఎక్సైజ్, పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

రక్షణ కల్పించండి

మతాంతర వివాహం చేసుకున్న తమకు యువతి తల్లిదండ్రుల నుంచి ప్రాణహాని ఉందని జొన్నలగడ్డకు చెందిన పిల్లుట్ల సతీష్‌రెడ్డి, కరిష్మాలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
గత ఏడాది అక్టోబర్‌లో ఇరువైపుల తల్లిదండ్రుల అంగీకారంతో వివాహం చేసుకున్నామని పేర్కొన్నారు. ఇప్పుడు విడాకులు ఇవ్వకపోతే చంపుతామని తన తండ్రి బెదిరిస్తున్నట్లు కరిష్మా ఫిర్యాదులో తెలిపింది. తమకు రక్షణ కల్పించాలని కోరారు.

జనసేన నాయకుడు రూ.14లక్షలు తీసుకుని మోసం చేశాడు

నరసరావుపేట రూరల్: విదేశాల్లో ఉన్న తమ కుమారులపై కారు ప్రమాద కేసు నమోదు కావటంతో దాన్ని పరిష్కరిస్తానని గురజాలకు చెందిన జనసేన నాయకుడు కటకం అంకమ్మరావు రూ.14 లక్షలు తీసుకొని మోసం చేశాడంటూ దుర్గికి చెందిన ప్రమీల అనే మహిళ జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేసింది. కారు ప్రమాద ఘటన తెలిసిన వెంటనే అంకారావును సంప్రదించగా ఆందోళన చెందవద్దని సమస్య పరిష్కరిస్తానని, దీనికిగానూ రూ.46 లక్షలు డిమాండ్ చేశాడన్నారు. రూ.7లక్షలు చొప్పున రెండు దఫాలుగా రూ.14లక్షలు చెల్లించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. సమస్య పరిష్కారం కాకపోవటంతో అంకారావును తిరిగి డబ్బులు అడిగితే దిక్కున్న చోట చెప్పుకోమని, డబ్బులు ఖర్చు అయ్యాయని బెదిరింపులకు పాల్పడుతున్నాడని పేర్కొంది. తమకు న్యాయం చేసి తన డబ్బులు తనకు ఇప్పించాలని కోరింది.

విద్యుదాఘాతానికి యువకుడి బలి

సంతమాగులూరు (అద్దంకి): విద్యుదాఘాతానికి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని అడవిపాలెం పవర్ ప్లాంటు వద్ద సోమవారం జరిగింది. ప్రమాదంలో ఏల్చూరు గ్రామానికి చెందిన జూటూరు కొండ గురవయ్య తొలుత తీవ్ర గాయలపాలయ్యాడు. క్షతగాత్రుడిని బంధువులు నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. గురవయ్య అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

కక్షపూరిత రాజకీయాలు



సీనియర్ మోస్ట్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడం దారుణం. ఆయనను అరెస్టు చేయడం కక్షపూరిత రాజకీయాలకు, అప్రజాస్వామిక చర్యలకు పరాకాష్టగా కనిపిస్తోంది. ఆయనను విడుదల చేయాలి. దేవతల రాజధానిలో అత్యాచారాలు, హత్యలు, దాడులు, విధ్వంసాలు, దళితులపై దాష్టీకాలు ఎందుకు జరుగుతున్నాయో పాలకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

– ఈదర గోపీచంద్, సోషల్ యాక్టివిస్టు

దాడులు తగవు



ఏ విషయంలో అయినా పొరపాటుగా వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు చేయవచ్చు. అతనిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటే సరిపోతుంది. గతంలోనూ ఎందరో నాయకులు మహిళలపై వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ప్రత్యేకంగా సాక్షి పత్రిక కార్యాలయాల వద్ద ఆందోళనలు, దాడులు చేయటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. రాజకీయ కక్షగా దీనిని మలచుకోవాలనుకోవటం ఏమాత్రం సబబు కాదు. వీటిని ప్రజాస్వామ్య వాదులు ఎవరూ హర్షించరు.

–షేక్ శిలార్ అహమద్, సీపీఎం పట్టణ కార్యదర్శి, నరసరావుపేట

పొరపాటుగానే చూడాలి



సాక్షి చానల్‌లో ఓ వ్యక్తి ఏదో అన్నారని మొత్తం రాష్ట్రానికి చుట్టి ప్రతిచోటా సాక్షి కార్యాలయాల వద్ద ఆందోళనలు ఏమాత్రం సబబు కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికలకు ఒక స్థానం ఉంది. వాటిని కాపాడుకుంటేనే ప్రజాస్వామ్యం మనుగడ సాగుతుంది. ఇటువంటి పోకడలను ఎవరూ సమర్థించకూడదు. ఇలాంటి ఘటనలు హర్షణీయం కాదు.

– కాసా రాంబాబు, సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి

– (నరసరావుపేట)

స్వర్ణాంధ్ర విజన్ సాధనకు యాక్షన్ ప్లాన్

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి
- సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి హాజరైన మంత్రి, ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యేలు

నరసరావుపేట: స్వర్ణాంధ్ర విజన్–2047 అమలుకు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో యాక్షన్‌ప్లాన్ యూనిట్ల ఏర్పాటుతో క్షేత్రస్థాయి వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందని రాష్ట్ర విద్యుత్‌శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర విజన్ 2047పై రాష్ట్ర సెక్రటేరియట్ నుంచి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి మంత్రి గొట్టిపాటితో పాటు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట, మాచర్ల ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జీడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు వేర్వేరు మార్గాల్లో అభివృద్ధికి కృషి చేస్తున్నారని, స్వర్ణాంధ్ర యాక్షన్ ప్లాన్ ద్వారా వారు ఏకీకృత వ్యవస్థ ద్వారా ఒకే లక్ష్యంతో సమగ్రాభివృద్ధికోసం పని చేస్తారన్నారు. స్వర్ణాంధ్ర యాక్షన్‌ప్లాన్ ప్రకారం జిల్లా స్థాయి యాక్షన్ ప్లాన్ యూనిట్‌కు ఇన్‌చార్జి మంత్రి చైర్‌పర్సన్‌గాను, లోక్‌సభ ఎంపీ వైస్‌చైర్‌పర్సన్‌గాను జిల్లా కలెక్టర్ పరిపాలన వైస్‌చైర్ పర్సన్‌గా, సీపీఓ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. రాజ్యసభ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీచైర్‌పర్సన్, మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు సభ్యులుగా ఉంటారని అన్నారు.

గడువులోగా సర్వేలన్నీ పూర్తిచేయాలి

అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట: గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేలు నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో సర్వేల నిర్వహణపై మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యోగాంధ్ర యాప్ ద్వారా యోగా దినోత్సవ ఔత్సాహికుల రిజిస్ట్రేషన్లు, 5 నుంచి 15 ఏళ్ల వయసు బాలల ఆధార్ అప్‌డేట్ సర్వే, రేషన్ కార్డు ఈకేవైసీలు పూర్తి చేయాలన్నారు. రేపు సాయంత్రం నాటికి యోగాంధ్ర పార్ట్–1 సర్వే పూర్తి చేయాలని, అనంతరం పార్ట్–2 సర్వే ప్రారంభం అవుతుందన్నారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభమయ్యేనాటికి ఆధార్ అప్‌డేట్ సర్వే పూర్తిచేసి విద్యార్థుల ప్రవేశాలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి ఎం.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వం దిగొచ్చే వరకూ పోరాటం

- మాన్యువల్ కౌన్సెలింగ్ కోసం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పట్టు
- నిరాహార దీక్ష చేపట్టిన సంఘాల నాయకులు


శిబిరంలో సంఘ నాయకులు బసవ లింగారావు, కళాధర్, పెదబాబు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: సెకండరీ గ్రేడ్ టీచర్ బదిలీల్లో వెబ్ కౌన్సెలింగ్‌ను రద్దు చేసి మాన్యువల్ విధానంలో నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు ఆందోళనను ఉధృతం చేశారు. ఉమ్మడి గుంటూరుజిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నాయకులు, ఉపాధ్యాయులు నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక ఉమ్మడి గుంటూరు జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చిన విద్యాశాఖాధికారులు మోసపూరితంగా వెబ్ ఆప్షన్లకు దిగారన్నారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవడాన్ని నిరసిస్తూ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా డీఈవో కార్యాలయాల ముట్టడి ద్వారా ప్రభుత్వానికి నిరసన తెలియజేసినప్పటికీ, ప్రభుత్వంలో చలనం రాలేదని విమర్శించారు. పుండుమీద కారం చల్లినట్లు విద్యాశాఖా మంత్రి లోకేష్ మాన్యువల్ కౌన్సెలింగ్‌కు చట్టం అడ్డం వస్తుందని చెప్పడం, నమ్మిన ఉపాధ్యాయులను మోసం చేయడమేనని తెలిపారు. జీఓ117 రద్దు, తెలుగు మాధ్యమ పునరుద్ధరణ, పని ఒత్తిడ తగ్గింపుపై ఇచ్చిన మూడు హామీలు అమలు చేయకుండా మోసగించారని ఆరోపించారు. ఐక్యవేదిక నాయకులు ఎం.కళాధర్, డి.పెదబాబు, జీవీ రామకృష్ణ , సోషలిజం మాట్లాడుతూ వెబ్ కౌన్సెలింగ్ వద్దని ఒక పక్క ఉద్యమం చేస్తుంటే మరొక పక్క డీఈఓ, ఎంఈవో కార్యాలయాల నుంచి ఉపాధ్యాయులకు ఫోన్లు చేస్తూ వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలాని బెదిరింపులకు దిగడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్స్ అనుభవం లేని మహిళా ఉపాధ్యాయులను ఏడిపించడం ఈ ప్రభుత్వానికి, మంత్రికి మంచిది కాదని హితవు పలికారు. వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవద్దని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. నిరాహార దీక్ష శిబిరాన్ని సీనియర్ మహిళా నాయకురాలు కుసుకుమారి ప్రారంభించారు. శిబిరంలో ఐక్యవేదిక నాయకులు ఎం.హనుమంతరావు, ఎస్.రామచంద్రయ్య, మహమ్మద్ ఖాలీద్, డీకే సుబ్బారెడ్డి, వినయ్, సంపత్, షకీలా బేగం, జి.దాస్, కె.కృష్ణారావు, సుభాని, ప్రసాద్, సుబ్బారావు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల పరిరక్షణ

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: నిరంతర పోరాటాలతోనే హక్కులను పరిరక్షించుకోగలమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు పేర్కొన్నారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్ వద్ద సోమవారం 79వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సమరంలో బానిస సంకెళ్లను బద్దలు కొట్టి, 1946 మే 1న ఎస్టీయూ ఆవిర్భవించిందని తెలిపారు. 1947 జూన్ 9వ తేదీ నుంచి అధికారిక గుర్తింపు పొందిన తొలి ఉపాధ్యాయ సంఘం అని వివరించారు. ఏపీ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో శాశ్వత సభ్యత్వం కలిగిన ఎస్టీయూ 78 ఏళ్లుగా నిరంతరం ఉద్యమ స్ఫూర్తితో ప్రగతి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో పాటు వివిధ సౌకర్యాలను కల్పించడంలో ప్రభుత్వాలతో పోరాడి, సాధించడంలో విశేష కృషి చేసిందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉద్యమాలకు పుట్టినిల్లు ఎస్టీయూ అని చెప్పారు. సంఘ ఉద్యమ నేతలు మగ్దుం మొహిద్దీన్, పీవీ రాఘవాచారి, వీణా విజయ రామరాజు, పి. శ్రీరామమూర్తి వంటి నాయకల త్యాగం మరువలేనిదని కొనియాడారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలుగా పని చేస్తూ సంఘ పురోభివృద్ధికి పాటుపడాలని పెదబాబు సూచించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు షేక్ మొహబూబ్ సుభాని, నాయకులు పి. దిబ్బయ్య, వై. శ్యాంబాబు, యు. మహంకాళరావు, ఎంపీ సుబ్బారావు పాల్గొన్నారు.


ఎస్టీయూ పతకానికి వందనం చేస్తున్న నాయకులు

విద్యార్థులతో కూటమి ప్రభుత్వం బంతాట


ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

తాడేపల్లి రూరల్ : కృష్ణాజిల్లా ఈడుపుగల్లులోని అంబేద్కర్ ఐఐటీ నీట్ మహిళా అకాడమీ(గురుకుల పాఠశాల)ని మైలవరానికి తరలించ వద్దంటూ విద్యార్థినులు సోమవారం తాడేపల్లిలోని రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ నిధులతో నీట్, ఐఐటీ శిక్షణకు అద్దె భవనాలలో అకాడమీని స్థాపించారని తెలిపారు. 2014–15, 2015–16 సంవత్సరాల్లో శిక్షణకు గాను సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ 100 మంది విద్యార్థులను ఎంపిక చేసుకుని, ఒక్కొక్కరికీ రూ. 75 వేలు ఫీజుగా చెల్లించి కార్పొరేట్ కళాశాలల్లో చేర్చే వారని తెలిపారు. దీంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలం కావడంతో ర్యాంకులు సాధించే అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. 2017లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చీఫ్ సెక్రటరీ రావత్, సెక్రటరీ రాములు, చైర్మన్, అధికారులు బోర్డు మీటింగ్ నిర్వహించి విద్యార్థులకు కార్పొరేట్ విద్యకు దీటుగా ఐఐటీ, నీట్ అకాడమీలు స్థాపించడానికి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.ఈ నేపథ్యంలో ఈడుపుగల్లులో అంబేద్కర్ ఐఐటీ నీట్ మహిళా అకాడమీ ఏర్పాటు చేశారని వివరించారు. అధికారులు అలసత్వం వహించి విద్యార్థుల సంఖ్యను తగ్గించడం, నిర్ణీత సమయానికి అడ్మిషన్లు ఇవ్వకపోవడంతో ఆశయం పూర్తిగా నెరవేరలేదని విమర్శించారు. ఈ స్థితిలో విద్యార్థులు, భావితరం వారి శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఈడుపుగల్లు నుంచి విద్యార్థులను తరలించే కార్యక్రమాన్ని నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.

చదరంగంతో పెరగనున్న మేధాశక్తి



గుంటూరు ఎడ్యుకేషన్: భారత దేశంలో పురాతన ఆటగా మొదలైన చదరంగం అంతర్జాతీయ స్థాయిలో నేడు ప్రముఖ క్రీడగా గుర్తింపు పొందిందని గుంటూరు జిల్లా ఇన్‌టాక్ కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో సోమవారం జిల్లా స్థాయి చెస్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బాలబాలికలకు చిన్న వయసు నుంచే చదరంగంలో మెళకువలను నేర్పాలని తెలిపారు. ఆట ద్వారా వ్యూహాత్మక ఎత్తుగడల నైపుణ్యత, మేధో పరిజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం ఏర్పడి ఉన్నత స్థాయి వ్యక్తులుగా ఎదిగేందుకు దోహదం చేస్తుందని వివరించారు. భారతీయ విద్యా భవన్స్ కార్యదర్శి పి.రామచంద్రరాజు మాట్లాడుతూ భవన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీల్లో జిల్లావ్యాప్తంగా 150 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని నైపుణ్యాలను ప్రదర్శించారని తెలిపారు.

కౌలు రైతులకూ 'అన్నదాత సుఖీభవ' ఇవ్వాలి



లక్ష్మీపురం: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలని, భూ యజమాని సంతకం తొలిగించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతుల సమస్యలపై ఈనెల 11న నిర్వహిస్తున్న 'చలో మంగళగిరి'ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఎన్నికల ముందు కూటమి నేతలు పాత కౌలు చట్టాన్ని రద్దు చేస్తామని, భూయజమాని సంతకం తొలగించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడానికి కొత్త చట్టం తీసుకొస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. అన్నదాత సుఖీభవ కిందట రూ. 20 వేలు ప్రతి కౌలు రైతుకు ఇస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనా పథకాలు ఊసే లేదని విమర్శించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షులు బి.రామకృష్ణ, సహాయ కార్యదర్శి పాశం రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా ఏడీఎంగా సత్యనారాయణ చౌదరి

కొరిటిపాడు: గుంటూరు జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులుగా అనంతపురం జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న సత్యనారాయణ చౌదరి నియమితులయ్యారు. ఆయన ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన బదిలీల ప్రక్రియలో భాగంగా గుంటూరు జిల్లా ఏడీఎంగా నియమితులయ్యారు.

శ్రీవారి ఆలయాన్ని స్వాధీనం చేసుకున్న దేవదాయ శాఖ


ఆభరణాలను అధికారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు రూరల్: గోరంట్లలోని శ్రీలక్ష్మీ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని దేవదాయ శాఖ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. స్వామి వారి రూ. 9కోట్లు విలువచేసే బంగారు, వెండి ఆభరణాలను ఈఓ వెంకటేశ్వరరావుకు ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్ అందజేశారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, గాదె వెంకటేశ్వరరావు, నల్లపాడు సీఐ వంశీధర్, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో వేణుగోపాల్ వాటిని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 22 సంవత్సరాల కిందట దేవాలయాన్ని ప్రతిష్ఠించామని, అప్పటి నుంచి విశేష పూజలను నిర్వహించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ కొంతమంది పనిగట్టుకొని కావాలనే వేణుగోపాల్ పైన అభాండాలు వేయడం వల్ల దేవదాయ శాఖ ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆయన హయాంలోనే భక్తులు ఇచ్చిన కానుకలతో స్వామికి ఆభరణాలు చేయించారని చెప్పారు. లాకర్లో ఉన్న ఆభరణాలను తీసి అందరి సమక్షంలో ఆయన అధికారులకు అందజేసినట్లు పేర్కొన్నారు. గోరంట్లలో తొమ్మిది దేవాలయాలను నిర్మించిన వేణుగోపాల్ సేవలు ఇంకా కొనసాగాలని ఎమ్మెల్యే రామాంజనేయులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు కంచర్ల ఆంజనేయులు, ఆల శివారెడ్డి, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, నాగేశ్వరరావు, మహేందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మూడు బైకులు ఢీ

- ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం
- పలువురికి గాయాలు


మోహన కృష్ణ మృతదేహం

రాజంపేట: కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని రాజంపేట గుండ్లూరు క్రాస్ రోడ్డులో మూడు బైక్‌లు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బోయనపల్లిలో ఇంజినీరింగ్ చదువుతున్న గుంటూరుకు చెందిన మోహనకృష్ణ(20) మృతి చెందాడు. రామాపురానికి చెందిన ఇద్దరు, బొప్పావారిపల్లికి చెందిన ఇద్దరు, సమీప తోటలో పనిచేసే మరో వ్యక్తి గాయపడ్డారు. విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మన్నూరు పోలీసులు తెలిపారు.